# కోడలొచ్చింది

ఆ రోజు పార్వతమ్మ కొడుకు పెళ్లి. ఇంటిముందు పెద్ద పందిరి, గుమ్మాలకు పచ్చని తోరణాలు, కళ్ళు మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాల అలంకరణ ఇవేవీ లేవు. సన్నాయి, స్వరాలు, బంధుమిత్రుల సందడి వినిపించడం లేదు. వియ్యపురాలి హోదాలో పట్టరాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోవడంలేదు. పార్వతమ్మ గుండెనిండా ఆవేదనతో కళ్ళనిండా నీటిబరువుతో ఒంటరిగా రోదిస్తోంది. ఆమె ఆశలన్నీ అడియాసలయినందుకు, కలలన్నీ కల్లలుగా మారినందుకు ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంటోంది.

ఆమె ఇరుగుపొరుగులలో కాస్త మనసున్న వాళ్ళు వచ్చి ధైర్యంచెప్పి ఓదారుస్తున్నారు. కానీ ఎవరి ఓదార్పు ఆమె దుఃఖాన్ని ఉపశమింపజేయలేకపోతోంది. నవమాసాలు మోసి పాలికేళ్ళు పెంచిన తన కొడుకు తన ఆశలను, కలలను హరించి తన మాట లక్ష్యపెట్టకుండా కులంకాని అమ్మాయిని చేసుకుని తనకు దూరమైతే ఆ దుఃఖాన్ని నిజానికి ఎవరి ఓదార్పు ఉపశమింప జేయగలదు?

పార్వతమ్మను ఎంతగానో అభిమానించే మీనాక్షమ్మ వచ్చింది. ఆమెను ఊరడించేందుకు ప్రయత్నించసాగింది.

'చూడు పార్వతమ్మా! అద్దాలలో బిడ్డలుకానీ గడ్డాలు వచ్చేక బిడ్డలా చెప్పు. రెక్కలొచ్చిన పక్షులు గూడు విడిచి ఎక్కడెక్కడికో ఎగిరిపోతాయి. కన్నందుకు పెంచి పెద్దచేశావు. తండ్రిలేని లోటు కూడా తెలియనివ్వకుండా విద్యాబుద్ధులు చెప్పించావు. నీ బాధ్యత నెరవేర్చుకున్నావు. నీ కొడుకు ఎక్కడ వున్నా 'నా తల్లి దేవతలాంటిది' అని తలుచుకోకుండా వుండగలడా చెప్పు' అంది పార్వతమ్మను తన వైపుకు తిప్పుకుంటూ.

ప్రాణస్నేహితురాలి ఓదార్పుకు పార్వతమ్మ దుఃఖం రెట్టింపయ్యింది. "నా మీద అభిమానమే వాడికుంటే నా మాట కాదని ఇంతకు తెగిస్తాడా? నువ్వే చెప్పు" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

"పోనీలే, ఆ సంగతి వదిలెయ్యి. పొద్దుటనుంచి నువ్వు పచ్చి మంచినీళ్ళయినా ముట్టలేదు. వాడు కులాసాగా పెళ్లి చేసుకుంటున్న రోజు నువ్వు అభోజనం ఉంటే వాడికి జయం కాదు. అప్పుడే చీకటి పడిపోయింది. నా మాట విని కాస్త అన్నం తిను. లే మరి" పార్వతమ్మ చెయ్యిపుచ్చుకుని వంటింట్లోకి నడిచింది మీనాక్షమ్మ. బలవంతాన ఆమెచేత అన్నం తినిపించింది.

ఆ రాత్రి తోడుగా పడుకుంది మీనాక్షమ్మ. పార్వతమ్మకు కాస్త కునుకు పట్టింది.

'హమ్మయ్య పార్వతి నిద్రపోయింది' అనుకుని తనూ నిద్రలోకి జారుకుంది మీనాక్షమ్మ. కానీ పార్వతమ్మ నిద్ర కాసేపటికి చెదిరిపోయింది. ఉలిక్కిపడి లేచి కూర్చుంది. ఆలోచనలు మనసును పిండేస్తున్నాయి. పెళ్ళయిన పదేళ్ళకే భర్తని పోగొట్టుకుంది. తన కంటి వెలుగై ఆశలన్నీ పండిస్తాడనుకున్న కన్న బిడ్డకూడా ఈనాడు తనకు దూరమైపోయాడు! తనిక ఒంటరిగా బ్రతుకు ఈడ్వవలసిందే!

గతం, వర్తమానం నీడలుగా ఆమె కళ్ళముందు కదలాడుతున్నాయి. భర్త చనిపోతే పుట్టెడు దుఃఖాన్ని కొడుకుని చూసుకుని మరిచిపోయింది. ఆ పసివాడి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పూర్తిగా నిమగ్నురాలైపోయింది. ఉన్న కొద్దిపాటి పొలంపైన వచ్చే ఆదాయంతో గుట్టుగా సంసారం సాగిస్తూ కన్నకొడుకుని ఏ లోటూ లేకుండా పెంచింది.

రోజా రోజుకూ శుక్లపక్ష చంద్రుడిలా పెరుగుతున్న పిల్లాడ్ని చూసుకుని ఎంతో మురిసిపోయేది. ఆమె అనుకునేది: కొడుకు పెళ్ళయి తన ఇంటికి కోడలు వస్తే ఆడపిల్లలేని లోటుకూడా తీరిపోతుంది. లక్ష్మీదేవిలా కళకళలాడుతూ నట్టింట కోడలు తిరుగాడుతూ వుంటే తన ఆనందానికి అంతే వుండదు అనుకునేది. అందుకే రఘురాం చదువు పూర్తయినప్పటినుంచి సంబంధాలకోసం వెతకటం ప్రారంభించింది.

తన ఇంటికి రాబోయే కోడలి అందచందాల గురించికానీ, చదువుసంధ్యల గురించికానీ తను కోరికలు పెంచుకోలేదు. తన ఇంటికి వచ్చే కోడలు కన్నకూతురులా మసలుతూవుంటే అంతే చాలు. కొడుకునీ, కోడల్నీ చూస్తూ పుట్టే మనమళ్ళ ముద్దు మురిపాలతో హాయిగా తన శేషజీవితం వెళ్ళబుచ్చాలి- అనుకుంది. కానీ ఆ తృప్తి మిగలలేదు తనకు. తనను ఒంటరిగా వదిలేసి రఘు తన దారి తను చూసుకున్నాడు. ఈ ఆలోచనలతోనే ఆ రాత్రి తెల్లారిపోయింది పార్వతమ్మకు.

పార్వతమ్మ స్నానం చేసి కాఫీ తాగేవరకూ మీనాక్షమ్మ ఇంటికి వెళ్ళలేదు. ఓ వారం రోజులు మీనాక్షమ్మ పార్వతమ్మని కనిపెట్టుకొనే వుంది. తన ఇంటిలో వంటచేసి తెచ్చి తినిపించేది. క్రమంగా తనే వంట చేసుకోవడం మొదలుపెట్టింది. ఇప్పుడు మీనాక్షమ్మ ఉదయం సాయంత్రం వచ్చి కబుర్లు చెప్పి వెళ్ళిపోతోంది. పార్వతమ్మ మాత్రం నిర్లిప్తంగా రోజులు గడుపుతోంది. చుట్టు పక్కలవారు తన గురించీ తన కొడుకు గురించీ గుసగుసలాడుతుంటే అసలే గాయపడిన పార్వతమ్మ హృదయం మరింత తీవ్రమైన గాయానికి గురవుతోంది. తన మనసును కలవరపెట్టే ఆ సంఘటనలు మీనాక్షమ్మతో చెప్పుకుని వాపోడం తప్ప మరేమీ చెయ్యలేకపోతోంది.

ఓసారి అలా పార్వతమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకున్నప్పుడు "ఏమీ అనుకోకు గానీ పార్వతీ, ఈ విషయంలో నీవూ పొరపాటు చేశావు అనిపిస్తుంది. నిన్ను ఎంతగానో ప్రేమించి గౌరవంతో చూసి నువ్వే సర్వస్వంగా భావిస్తున్న రఘురాం తనకు నచ్చిన అమ్మాయిని చేసుకుంటానంటే నువ్వు తనతో అంతగా వాదులాడాలా? అంత మాత్రానికే ఏం కొంపమునిగిందని. ఆ అమ్మాయిని చేసుకుంటే నువ్వు నా కొడుకువి కాదని, నేను నీ తల్లిని కాదని బంధాన్ని పూర్తిగా

తెంచేసినట్లు మాట్లాడేశావు.. ..నువ్వు నిజంగానే ఆ అమ్మాయి కళ్ళ ఎదుట వుంటే ఏ అఘాయిత్యం తలపెడతావో అనుకొని వుంటాడు. అందుకే నీకు పూర్తిగా దూరమైపోయాడు. నువ్వు చూస్తే వాడి కోసమే బెంగతో రోజు రోజుకూ ఇలా అయిపోతున్నావు" అనేసింది మీనాక్షమ్మ.

"నేను పొరపాటు చేశానంటావేమిటి? వాడు చేసిన పని బావుందా? కులం గోత్రం తెలియకుండా ఎక్కడెక్కడో పెరిగిన ఓ అమ్మాయిని తీసుకొచ్చి 'అమ్మా! నీ కోడలు' అంటే ఎలా ఆశీర్వదించమంటావ్? వాడికి నేనంటే ఏ మాత్రం ప్రేమున్నా నా మాట కాదని ఇలా చేసేవాడు కాదు. ఏనాడు నా మాట కాదని ఆ అమ్మాయిని చేసుకున్నాడో ఆనాటితోనే నాకూ వాడికీ ఋణం తీరిపోయింది."

"అదే వద్దంటున్నాను. కాలం మారిపోతోంది పార్వతీ. ఇలాంటి ఇలాంటి పట్టింపులు మానుకోవాలి. ఈ రోజుల్లో కులమతాలనకన్నా ఒకరిని మరొకరు అర్థంచేసుకుని మనస్సులు కలసిన తర్వాతే పెళ్ళి చేసుకుని దాంపత్యజీవితంలో అడుగుపెట్టడం ముఖ్యంగా భావిస్తున్నారు ఈ తరంవాళ్ళు. ఈ కులమతాలకు ప్రాముఖ్యత తగ్గిపోయింది. నువ్వు నీ కొడుకుని అర్థం చేసుకొని వుంటే కోడలు నీ ఇంట తిరుగాడుతూ వుండేది. తప్పక నీ కలలుపండేవి. నీ కోరికలన్నీ తీరేవి. నువ్వే చేతులారా నీ అవివేకంతో వాళ్ళను దూరం చేసుకున్నావు." మీనాక్షమ్మ మాటలను పార్వతమ్మ భరించలేకపోయింది.

'అంతా నాఖర్మ. ఎంతమంది తల్లిదండ్రుల మాట జవదాటకుండా నడచుకోవడంలేదు?' అనేసింది. మీనాక్షమ్మ వెళ్లిపోయినా పార్వతమ్మ మనస్సులో మీనాక్షమ్మ మాటలే ధ్వనిస్తున్నాయి. పదే పదే ఆ మాటలే మననం చేసుకుంటూ వుండిపోయింది.

తొలిసారిగా పార్వతమ్మ తన కొడుకుని తనే దూరం చేసుకున్నానని పశ్చాత్తాపపడింది. తీవ్రమైన ఆందోళనకు గురికావడంవల్లనో మరే కారణాలవల్లనో పార్వతమ్మ మంచానపడింది. తన ఇంటి పనులతోనే సతమతమయ్యే మీనాక్షమ్మకు అదనంగా ఈ పార్వతమ్మ సేవలు చేయడం ఇబ్బందిగా అనిపించి పార్వతమ్మ బంధువులందరికీ ఉత్తరాలద్వారా విషయం తెలియపర్చింది. కాని పార్వతమ్మకోసం బంధువులెవరూ రాలేదు. దాంతో, ఎలాగయినా రఘురాం ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని తల్లిని అతనికి అప్పగించాలని విశ్వప్రయత్నం చేసింది. కానీ అదీ ఫలించలేదు. రఘురాం ఎక్కడ ఉన్నదీ తెలుసుకోలేకపోయింది మీనాక్షమ్మ. రోజూ ఏదోవేళ తీరిక చేసుకొని పార్వతమ్మ దగ్గరే గడుపుతోంది.

ఓరోజు ఇద్దరూ మగతనిద్రలో ఉండగా నెమ్మదిగా ఎవరో వీధి తలుపు తట్టారు. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. మీనాక్షమ్మ వెళ్ళి తలుపు తెరిచింది. వచ్చిన వ్యక్తి ఎవరో ఆమెకు తెలియదు. "ఎవరు కావాలి?" అంది.

"పార్వతమ్మగారి కోసం వచ్చాను" అంది ఆ అమ్మాయి.

"అలాగా, లోపలికి రా" అంటూ మీనాక్షమ్మ ఆ అమ్మాయిని లోపలికి తీసుకువెళ్ళింది.

తనకోసం వచ్చిందెవరా అని పార్వతమ్మ కళ్ళు పెద్దవిచేసి చూసింది. ఎప్పుడూ ఆ

అమ్మాయిని చూసినట్లులేదు.

"ఇంతకూ ఎవరే పార్వతీ ఈ అమ్మాయి?" అడిగింది మీనాక్షమ్మ.

"గుర్తురావటంలేదు" ఆమెకు మాత్రం వినిపించేలా అంది పార్వతమ్మ.

ఆ యువతి మాత్రం పార్వతమ్మ చెయ్యిపట్టుకుని ఆప్యాయంగా "ఇప్పుడు మీ ఒంట్లో ఎలా ఉంది? ఎవ్వరూ దగ్గరలేక ఎన్ని అవస్థలు పడ్డారో. ఇక నేను వచ్చేశాను. మిమ్మల్ని కనిపెట్టి ఉంటాను. మిమ్మల్ని వదలి ఎక్కడికీ వెళ్ళను." అంది. పార్వతమ్మకు ఆ అమ్మాయి మాటలకు కొండంత బలం వచ్చింది.

మీనాక్షమ్మ వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి ఆ అమ్మాయికి ఇస్తూ "ఇంతకీ నీ పేరు చెప్పావు కాదు" అంది.

"సుగుణ" అంది ఆ అమ్మాయి వినయంగా.

"ఇన్నాళ్ళు పార్వతమ్మగారికోసం మీరెంతో శ్రమించారుటగా. ఇక నేను అంతా చూసుకుంటాను. అత్తయ్యగారు కోలుకున్నాక మా ఊరు వెడతాను" అంది సుగుణ.

ఆ మాటకి మళ్ళీ ఉలిక్కిపడింది.

"అత్తయ్య అంటోంది ఈ అమ్మాయి. తనకి ఏ వంక చుట్టమో గుర్తు రావటంలేదు" అనుకుంటూ సుగుణ పార్వతమ్మ బాధ్యత స్వీకరించగానే మీనాక్షమ్మ మనస్సు తేలికపడింది. సుగుణ వచ్చిన నాలుగురోజులకు పార్వతమ్మ ఆరోగ్యం కాస్త మెరుగయింది. తనకు అన్ని సపర్యలు చేస్తు కంటికిరెప్పలా చూసుకునే సుగుణ అంటే పార్వతమ్మకు ఎంతో ఆపేక్ష ఏర్పడింది. చకచక పనిచేసేస్తూ, హాయిగా కబుర్లు చెబుతూ సుగుణ ఇంట్లో తిరుగుతూ వుంటే పార్వతమ్మకు ఏదో తెలియని ఆనందంగా వుంది. తను చేసుకున్న పుణ్యమంతా ఫలించే సుగుణ తన ఇంట అడుగుపెట్టిందేమో. తనకోసం భగవంతుడు పంపిన అపరంజి బొమ్మలా సుగుణ ఆమెకు కనిపించసాగింది.

తనతో ఇంతగా పెనవేసుకుపోతున్న సుగుణ తనకేమవుతుంది? బాగా దగ్గర చుట్టాలకే ఇంత అభిమానం ఉండదే. మరి ఈ అమ్మాయికి తనపట్ల ఎందుకింత ఆపేక్ష? ఎంత ఆలోచించినా ఈ అమ్మాయికి తానేమవుతుందో గుర్తురావటంలేదు. తనకి మేనకోడలు వరసైనా ఉండాలి. లేకపోతే అత్తయ్యా! అని ఎందుకు పిలుస్తుంది? పోనీ అడిగేస్తే ఏమనుకుంటుందో!

అయినా నువ్వు ఎవరమ్మా ఏ వంక చుట్టానివి! అని ఎలా అడగగలను? సుగుణ అయినా ఎవరి ప్రస్తావనా తీసుకురావటంలేదు. ఏదైతేనేం సుగుణ ఇంట్లో ఉంటే తన బ్రతుకులో వెలితంతా తీరిపోయినట్లుయింది. ఎప్పుడో పసితనంలో ఉండగా సుగుణను చూసి ఉంటుంది తను. అందుకే గుర్తుపట్టలేకపోతోంది తను. ఆడపిల్ల ఎదగగానే పూర్తిగా మారిపోతుంది. పోల్చుకోవటమే కష్టం- అని సరిపెట్టుకుంది.

"అత్తయ్యగారూ ఏమిటి ఆలోచిస్తున్నారు? మీకు కాస్త ఒంట్లో బాగుందిగా, గుడికి

వెడదాము. మీరు ఆరోగ్యంగా ఉంటే పూజ చేయిస్తానని అమ్మవారికి మొక్కు కున్నాను" అంది. "అమ్మాయీ! నేనంటే నీకెందుకింత అభిమానం?" పార్వతమ్మ మాటలకు చిరునవ్వుతో "అదిఅంతే" అంది సుగుణ. పార్వతమ్మకు ఏమీ అర్థంకాక తెల్లబోయి చూసింది. గుడికి వెళ్ళి వచ్చాక సుగుణతో పార్వతమ్మ అంది. "నా ఆరోగ్యం బాగుపడిందంటే అంతా నీ చలవే తల్లీ.'

"అంతా నా అదృష్టం. మీకు సేవచేసే భాగ్యం కలిగింది. ఇక కొద్దిరోజుల్లో నేను ఊరు వెళ్ళిపోవాలి, మావారు ఉత్తరం వ్రాశారు." అంది.

పార్వతమ్మకు సుగుణ వెళ్ళిపోతుందంటే చెప్పలేని బాధ కలిగింది. మళ్ళీ తను ఒంటరిగా ఉండవలసిందే. ఇంకా ఆ అమ్మాయిని తన దగ్గరే ఉండమనడానికి తనకే హక్కు ఉంటుంది? ఆ పిల్ల సంసారం ఆ పిల్లది. తన దగ్గర ఎంతకాలం ఉంటుంది? అనుకుంది. ఆ మాటే మీనాక్షమ్మతో అంది. "నువ్వు అలా అనే అనుకుంటే సుగుణ నీతోనే ఉంటుంది" అంటే పార్వతమ్మ ఆశ్చర్యపోయింది.

"అవును అత్తయ్యా. మీరు క్షమిస్తే ఒకమాట చెప్తాను" అంది సుగుణ, వాళ్ళ దగ్గరకు వచ్చి కూర్చుంటూ.

"నేను నిన్ను క్షమించడమేమిటమ్మా, నువ్వు ఏం చెప్పినా సంతోషంగా వింటాను" ఆప్యాయంగా సుగుణని దగ్గరకి తీసుకుంది.

"నేను మీ కోడలు సుగుణను అత్తయ్యా" తడబడుతూ చెప్పింది.

"అవునే పార్వతీ, నువ్వు నీ పుణ్యాలరాశిగా భావిస్తున్న ఈ అమ్మాయే నీ కోడలు. వచ్చిన మరునాడే సుగుణ నాతో విషయమంతా చెప్పింది. రఘువస్తే నువ్వు ఏమంటావో అని భయపడి నీకు దూరమయ్యాడేకానీ కన్నతల్లిని మరచిపోయే కఠిన స్వభావంకాదు రఘుది" అంది.

"అవునత్తయ్యా, మీరు అనారోగ్యంతో బాధపడుతున్నారని మీ అబ్బాయిగారి స్నేహితుడు పనిమీద మా ఊరువచ్చినప్పుడు వారితో చెప్పారు. వారు ఎంతగానో కుమిలిపోయారు. చివరకు నేను ధైర్యం చేసి మీ దగ్గరకు వచ్చేశాను. ఇలా చేసినందుకు మన్నించండత్తయ్య" కన్నీళ్ళతో ప్రాధేయపడింది సుగుణ.

తను ఇన్నాళ్ళూ ఎంత పొరపడింది! మనస్సూ మమతా కులమతాలకు అతీత మయినవని తెలుసుకోగలిగింది. ఇక తను కొడుకూ కోడళ్ళ ఆత్మీయత చవిచూస్తూ కాలం గడిపేస్తుంది. అలా ఆలోచిస్తూ సుగుణని మరింతగా పెనవేసుకుంది.

"ఏమంటావ్ పార్వతీ ఏం మాట్లాడవేం?" అంది మీనాక్షమ్మ.

"నేనింకేమంటాను. నా పూజలన్నీ ఫలించి నా ఇంటికి కోడలొచ్చింది అంటాను" అంది మనస్సులో కులమతాల గోడలు తొలగిన పార్వతమ్మ.

('స్వాతి' మాసపత్రిక - మార్చి '94)